విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

విద్యార్థులు లేకపోవడంతో తృటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఒక ప్రయివేట్ స్కూల్ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకుని ఇళ్ల వద్ద దింపేందుకుగాను స్కూల్ వద్దకు వెళ్తోంది. ఈ క్రమంలో రంగమన్నార్ పేటలో సింగిల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్సఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. వెనువెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అప్పటికి ఇంకా విద్యార్థులు బస్సు ఎక్కకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ట్రాన్సఫార్మర్ స్తంభంపై నుంచి కింద పడింది.

ఎన్నికల 'ఆట'..!

అధికారపార్టీలో పలువురు సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు షాక్

రెండు జిల్లాలో ఐదుగురు ఎంఎల్‌ఎలకు టిక్కెట్ హుళక్కేనా

'పోలవరం' బాలరాజుకు లేదని స్పష్టం చేసినట్లు సమాచారం

చింతలపూడి, ఆచంట, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మార్పులు

నరసాపురం ఎంఎల్‌ఎ టిక్కెట్‌పైనా కొనసాగుతున్న ఉత్కంఠ

పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జికీ అవకాశం అనుమానమే

టిడిపిలోనూ టిక్కెట్లపై వీడని ఉత్కంఠ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఆట మొదలైంది. రెండు జిల్లాల్లోనూ అధికార పార్టీ ఎంఎల్‌ఎల్లో టిక్కెట్ టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఉంటుందో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రెండు జిల్లాల్లో ఐదు నియోజకవర్గాల్లో మార్పులు తప్పవని వైసిపి అధిష్టానం చెప్పకనే చెప్పింది. దీంతో టిక్కెట్ కోసం సిఎం వద్దకు ఎంఎల్‌ఎలు క్యూ కడుతున్నారు. తమకున్న పలుకుబడిని ఉపయోగించి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం పావులు కదుపుతున్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలకుగాను 13 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను వైసిపి గెలుచుకుంది. జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, పశ్చిగోదావరి జిల్లాలో ఏడు స్థానాలు, మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీస్థానాలు ఉన్నాయి. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న సిట్టింగ్ ఎంఎల్‌ఎలను మార్చి కొత్తవారిని బరిలోకి దింపాలని వైసిపి ప్రణాళికలు రచించింది. అందుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి టిక్కెట్ల మార్పులపై వైసిపి అధిష్టానం స్పష్టంగా ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు ఇప్పటికే టిక్కెట్ లేదని స్పష్టంగా తెలియచేసినట్లు తెలిసింది. అంతేకాకుండా సమర్ధుడైన వ్యక్తి పేరును సూచించాలని బాలరాజునే కోరినట్లు సమాచారం. దీంతో తన భార్యకు టిక్కెట్ ఇవ్వాలని బాలరాజు అడిగినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పోలవరం సిట్టింగ్ ఎంఎల్‌ఎకు టిక్కెట్ లేదని స్పష్టంగా అధిష్టానం తేల్చిసినట్లే. ఇక చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాకు ఎంఎల్‌ఎ టిక్కెట్ లేదని చెప్పినట్లు సమాచారం. అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని మొదట పేర్కొన్నట్లు ప్రచారం సాగింది. అమలాపురం ఎంపీ టిక్కెట్ పినిపే విశ్వరూప్‌కు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఎలిజా పరిస్థితి ఏమిటో తెలియకుండాపోయింది. చింతలపూడి నుంచి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును బరిలోకి దింపే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే సమయంలో రవాణాశాఖలో పని చేస్తున్న అధికారికి అవకాశం దక్కనున్నట్లు చెబుతున్నారు. రెండు, మూడు రోజుల్లో చింతలపూడి నియోజకవర్గం నుంచి ఎవరు పోటీ చేస్తారో తేలిపోనుంది. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుకు టిక్కెట్ లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇక్కడ నుంచి బిసి అభ్యర్థిని పోటీకి దింపాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థి నిర్ణయంపై మాత్రం ఇంకా అధిష్టానం ఒక నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. కైకలూరు టిక్కెట్ మార్పుపై ప్రచారం సాగినా మార్పు ఉండదని చెబుతున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లాల్లో మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజుకు టిక్కెట్ లేదని ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆయన్ని ఏవిధంగా పార్టీ ఉపయోగించుకుంటుందో ఇంకా స్పష్టత రాలేదని చెబుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న గుడాల గోపీకి కాకుండా వేరొకరికి టిక్కెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానం యోచిస్తున్నట్లు తెలిసింది. నరసాపురం ఎంఎల్‌ఎ ప్రసాద్‌రాజును మారుస్తారని ప్రచారం సాగినప్పటికీ స్పష్టమైన సంకేతాలు ఇంకా వెలువడలేదు. రెండు జిల్లాల్లో ఐదుస్థానాల్లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై వైసిపి నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని నేతలు చెబుతున్నారు. ఎంపీ స్థానాల్లో బరిలోకి దింపే అభ్యర్థులకు సంబంధించి తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది. ఏలూరు ఎంపీగా కోటగిరి శ్రీధర్ మరోసారి బరిలోకి దిగేందుకు సుముఖంగా లేనట్లు ప్రచారం సాగుతోంది. అదే సమయంలో నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణంరాజు ఇప్పటికే పార్టీ వ్యతిరేకిగా ఉండటంతో అక్కడ ఎవరిని బరిలోకి దింపాలనే దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

టిడిపిలోనూ టిక్కెట్లపై వీడని ఉత్కంఠ

ప్రతిపక్ష పార్టీ టిడిపిలోనూ ఎంఎల్‌ఎ టిక్కెట్ల కేటాయింపులపై ఉత్కంఠ కొనసాగుతోంది. టిడిపి, జనసేన పొత్తులో టిక్కెట్ల కేటాయింపు ఏవిధంగా ఉంటుందోననే టెన్షన్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జుల్లో నెలకొంది. జనసేనకు ఎన్ని సీట్లు కేటాయిస్తారోననే చర్చ కొనసాగుతోంది. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాలను జనసేనకు కేటాయించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులుకు ఎక్కడ టిక్కెట్ కేటాయిస్తారో తేల్చాల్సి ఉంటుంది. ఇంకా ఎస్‌సి నియోజకవర్గం చింతలపూడి, ఎస్‌టి నియోజకవర్గం పోలవరం స్థానాలు ఎవరికి కేటాయిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ స్థానాలకు ఆశావహులు ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా పార్టీల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఆశావహుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె ప్రారంభం

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమగ్ర శిక్ష అభియాన్‌లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు జిల్లాలోని ఉద్యోగులు బుధవారం సమ్మెబాట పట్టారు. స్థానిక విస్సాకోడేరు వంతెన వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని రాయ్ సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా ఇదే సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ జగన్ తన పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ యూనియన్ నాయకులు షేక్ బావాజీ, సిఆర్‌పిలు నాగలక్ష్మి, శ్రీనివాస్ మాట్లాడుతూ తమను తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు. పని భారం పెరిగిందని, ఖాళీ పోస్టులను భర్తీ చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేంద్ర, స్పందన, కాండ్రేగుల శ్రీనివాసు, చినిమిలి నాగార్జున, జగన్నాథం, విజయ మోహన్, ఎం.కృష్ణ, జి.సురేష్, తోట బాబు, బి.శ్రీనివాస్, అరవింద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పెనుమంట్ర మండలంలోని సమగ్ర శిక్ష సిబ్బంది బుధవారం నుంచి పెన్‌డౌన్ నిర్వహిస్తున్నారు. వీరి ఆందోళనకు యుటిఎఫ్, ఎపిటిఎఫ్, పిఆర్‌టియు, ఎస్‌టియు నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ చిన్న చంటి, ఐఎస్ కోఆర్డినేటర్ ప్రియాంక, సిఆర్‌పిలు నరేష్, ప్రసాద్, మంగతాయారు, అక్కౌంటెంట్ రాధాకృష్ణ, మెసెంజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 26 నుంచి సమ్మె

కమిషనర్‌కు నోటీసు అందించిన మున్సిపల్ కార్మికులు



సమ్మె నోటీసు అందిస్తున్న సిఐటియు, మున్సిపల్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 26 నుంచి సమ్మెలోకి వెళ్తారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు హెచ్చరిఒచారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా మున్సిపల్ కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం చెల్లించాలని తదితర డిమాండ్లతో దశలవారీ పోరాటాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు. పట్టణ పరిధి పెరగడంతో కార్మికులపై పని భారం పెరిగిందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులతో చర్చించి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాపు రాజు, ధనాల పెద్దిరాజు, బంగారు వరలక్ష్మి, నీలాపు అప్పన్న పాల్గొన్నారు.

విదేశీ విద్యాదీవెన నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహకరం : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగనన్న విదేశీ విద్యాదీవెన నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం జగనన్న విదేశీ విద్యా దీవెన నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 95 మందికి, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకరంగా రూ.కోటీ 50 లక్షలు మొత్తం రూ.42.6 కోట్లు జమ చేశారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జగనన్న విదేశీ విద్యా దీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్ యూనివర్సిటీల్లో మన విద్యార్థులు ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలబడుతోందన్నారు. జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థులకు రూ.60.76 లక్షలు నమూనా చెక్కును కలెక్టర్ అందజేశారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఐదుగురు అభ్యర్థులకు రూ.5 లక్షలు ప్రోత్సాహం జమ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.శ్రీమన్నారాయణరెడ్డి, వార్డు సచివాలయాల జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అంగన్వాడీల వంటావార్పు

తొమ్మిదో రోజుకు సమ్మె

ఉపాధ్యాయ, కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తమ సమస్యలు పరిష్కరించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ల జెఎసి ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజు జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దివ్య స్వరూపరాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మకు వ్యతిరేకంగా నినాదాలు చేసి చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో నేతలు యడవల్లి వెంకట దుర్గారావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తణుకులో అంగన్వాడీల వంటావార్పు

పెంటపాడు: పెంటపాడులో వంటావార్పు చేపట్టారు. సిహెచ్.శ్రీదేవి, వి.కనకమహాలక్ష్మి, ఆర్.అనురాధతోపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. అంగన్వాడీలకు ఐఎఫ్‌టియు నేత పి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గ, జి.జయలక్ష్మి, నాగమణి, కెవి.వరలక్ష్మిదేవి, కె.గాయత్రి, టి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం: వంటావార్పు నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి.హసీనాబేగం మాట్లాడారు. కార్యక్రమంలో బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, జయలక్ష్మి, పాల్గొన్నారు.

ఆచంట: అంగన్వాడీల సమ్మె పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరిస్తోందని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు విమర్శించారు. కచేరి సెంటర్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజు కొనసాగింది. వంటావార్పు నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, కార్యకర్తలు మైలే విజయలక్ష్మి, పుడక నాగలక్ష్మి, గుత్తుల శ్రీదేవి తదితరులు పాలొన్నారు.

మద్దతు పలికిన జనసేన నేతలు

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎదురుదాడి చేయడాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాశరావు ఖండించారు. స్థానిక సమ్మె శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపిపి ఎర్రగుప్పల నాగరాజు, నేతలు ఉన్నారు.

మొగల్తూరు: అంగన్వాడీలు భిక్షాటన చేసి కడుపు నింపుకోవాల్సిన దుస్థితికి ప్రభుత్వం దిగజార్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. అంగన్వాడీలు వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు యడ్ల చిట్టిబాబు అంగన్వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, రేఖ శాంభవి, రాజీ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెక్టార్ లీడర్లు సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతి పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, ఆశాలు, సివిల్ సప్లయీస్ హమాలీలు, రైస్‌మిల్లు వర్కర్లు సంఘీభావం తెలిపారు.

ఎంపిపి కారు అడ్డగింత

తహశీల్దార్ కార్యాలయ సమీపంలో అటుగా వెళ్తున్న ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) వాహనాన్ని అంగన్వాడీలు బుధవారం అడ్డగించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని అంగన్వాడీలు కోరి వినతిపత్రం అందజేశారు. దీనిపై వాసు మాట్లాడుతూ ప్రభుత్వం కచ్చితంగా అంగన్వాడీలకు అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని అన్నారు.

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణి వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు అన్నారు. అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడగా మండల కార్యదర్శి మండా సూరిబాబు, నేతలు యడవల్లి చంద్రావతి, ఝాన్సీరాణి, దవులూరి మార్తమ్మ పాల్గొన్నారు.

ఉండి: తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ లబ్ధిదారులు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లకుండా సమ్మెకు మద్దతుగా నిలబడటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి పాల్గొన్నారు.

పాలకొల్లు: పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీ నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, ఎం.ఏసమ్మ, సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, నేతలు పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుగొండ: వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు కె.తులసి, వి.హైమ, వివివి.నాగలక్ష్మి, పి.దుర్గాపరమేశ్వరి, త్రివేణి పాల్గొన్నారు.

పోడూరు: వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు దేవ సుధాకర్, పిల్లి ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, నేతలు ఎంవి.రాజశేఖర్, డి.క్షేమమూర్తి, కె.పెద్దిరాజు, కేతా నాగరాజు, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, బురాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: అంగన్వాడీలు బుధవారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, నాయకులు అరుణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు మహాలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. కార్యక్రమంలో జి.విజయలక్ష్మి, దుర్గ, సావిత్రి, షేక్ హసీనా, బేగం, మేరీ గ్రేస్, శ్యామల పాల్గొన్నారు.

వీరవాసరం: అంగన్వాడీల ఆందోళనకు యుటిఎఫ్ మద్దతు పలికింది. యుటిఎఫ్ నేతలు బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ముద్రగడ శ్రీనివాసరావు, జివి.రమణ, అప్పారావు, శ్రీనివాస్, దుర్గారావు అచ్చయ్య పాల్గొన్నారు.

నరసాపురంటౌన్: స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించకపోగా కేంద్రాల తాళాలు పగులగొట్టడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు గుబ్బల చిన్ని, కడలి రవి, వాసా రామలింగం, కోడి లక్ష్మణ, అంగన్వాడీ నేతలు జై శ్రీలక్ష్మి, రజిని, నిర్మలకుమారి, జి.రాజేశ్వరి, జి.వెంకటలక్ష్మి, జి.విజయలక్ష్మి, బి.నాగలక్ష్మి, ప్రేమకుమారి, రాజేశ్వరి, రత్నకుమారి, ఎ.నీలిమ. కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆకివీడు: అంగన్వాడీల సమ్మెను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిఐటియు పట్టణ అధ్యక్షులు కె.తవిటినాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వంటావార్పు చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు పెంకి అప్పారావు, అంగన్వాడీ నేతలు కె.పైడేశ్వరి, పి.శివలక్ష్మి, కె.దుర్గ, ఎ.అమ్మాజీ, ఇరానీదేవి, రామలక్ష్మి, కుమారి, కనకదుర్గ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. సమ్మెకు ఐఎఫ్‌టియు నేతలు సంఘీభావం ప్రకటించారు. ఆ సంఘ కార్యాలయం నుంచి అంగన్వాడీ సమ్మె శిబిరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు మాట్లాడగా తోట రామకృష్ణ పాల్గొన్నారు.

ఇరగవరం: ఇరగవరంలో అంగన్వాడీల సమ్మె తొమ్మిదో రోజు బుధవారం కొనసాగింది. దీనిలోభాగంగా వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.అజయకుమారి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు భోజనం వంటి పెట్టే అంగన్వాడీలు నేడు రోడ్డుపై వంట చేసుకునే దుస్థితికి జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వివిధ సంఘాల నేతలు సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, డ్వాక్రా విఒఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్వాడీ నాయకులు శ్యామల, ప్రభావతి, నాగలక్ష్మి, అనసూయ, జయలక్ష్మి, రూపాదేవి, కుమారి పాల్గొన్నారు.

తణుకురూరల్: అంగన్‌వాడీలు స్థానిక కోర్టు వద్ద వంటావార్పు నిర్వహించారు. తెలంగాణా కంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా గ్రాట్యుటీ ఇవ్వాలని, డౌన్ డౌన్ జగన్మోహన్‌రెడ్డి అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, పట్టణ పౌరసమాఖ్య కన్వీనర్ గార రంగారావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మొండి అయితే అంగన్వాడీలు జగమొండి అని అన్నారు. ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ సమ్మె జరుగుతుందన్నారు. సామాజిక హక్కుల న్యాయవేదిక నాయకులు పి.మురళీ, జనసేన నాయకులు అనుకుల రమేష్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మధుషీలా, కనకదుర్గ, రాజకుమారి, జ్యోతి, వసంత, ప్రమీల, మణిమాలతి పాల్గొన్నారు.



నినదిస్తున్న మెడికల్ రిప్స్

మెడికల్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలి

ఒక రోజు సమ్మెలో ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి శిరీష్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మెడికల్ రిప్రజెం టేటివ్స్ సమస్యలు పరిష్కరించా లని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి శిరీష్ కుమార్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఎపిఎంఎస్ ఆర్‌యు పిలుపుమేరకు బుధవారం భీమవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్ వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శిరీష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఫార్మా కంపెనీల యాజమాన్యాలు మెడికల్‌రిప్స్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయన్నారు. నిత్యావసర, అత్యవసర మందుల ధరలు తగ్గించాలని, మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని, నకిలీ నాసిరకం మందులు అరికట్టాలని, మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం (1976) వర్తింపజేయాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భీమవరం శాఖ కార్యదర్శి కెఎం.సూర్యచంద్రరాజు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మె శిబిరాన్ని సిఐటియు నేత ఇంజేటి శ్రీను, టిడిపి నాయకులు ఎం.గుణేశ్వరరావు, అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి, ఆక్వా వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లూరి అరుణ్, కెవిపిఎస్ నాయకులు క్రాంతిబాబు, డివైఎఫ్ఐ నాయకులు జి.ధనుష్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించి వారి సమ్మె విరమింపజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం మెంటేవారి తోట సుందరయ్య భవనంలో కౌరు పెద్ది రాజు అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సచివాయల ఉద్యోగులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి తాళాలు పగులగొట్టి చట్టవిరుద్ధంగా అంగన్వాడీ కేంద్రాలను స్వాదీనం చేసుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని, రైతుల బ్యాంకు రుణాలు రద్దుచేయాలని కోరారు. తడిచిన ధాన్యం సైతం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చింతకాయల బాబూరావు, జెఎన్‌వి,గోపాలన్, కేతా గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతానికి చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి బుధవారం వర్చువల్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికే సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర చేపట్టనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయాల స్థాయిలో క్రీడా బృందాలను అధికారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రీడా మైదానాలు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో పైపులైను పనులు ప్రారంభిస్తున్న సర్పంచి వెంకట జగ్గరాజు

పల్లె ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు అన్నారు. ఏలూరుపాడులో పైపులైన్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. 1980లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరాయి. శివారు ప్రాంతాలకు కుళాయి నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు తాగునీరందించేందుకు కార్యాచరణ రూపొందించారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.43.21 లక్షలతో 2.1 కిలోమీటర్ల పొడవునా హెచ్‌డిపిఇ పైపులైను పనులు జరుగుతాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ పైపులైన్ 8 అంగుళాలు 500 మీటర్లు, ఆ తర్వాత 6 అంగుళాలు, 5 అంగుళాలు సైజు గల పైపులైన్ పనులు చేపడతామని ఎంపిటిసి చిన్నపరెడ్డి రాంబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, నాయకులు మంతెన రామకృష్ణంరాజు, దాట్ల బాపిరాజు, దాట్ల రామభద్రరాజు, ఆదిత్య, ఆదిముక్కల సూర్యప్రకాష్ ఇన్‌ఛార్జి ఎఇ ఫణికుమార్ పాల్గొన్నారు.

'రామానుజన్ గణితం పుస్తకావిష్కరణ'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎపి మ్యాథమెటిక్స్ ఫోరం, జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు పట్టణానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు ఆర్.హరిగోపాల్ రాసిన 'రామానుజన్ గణితం' పుస్తకాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం ప్రతి సందర్భంలో వెంట ఉంటుందని, విద్యార్థులు గణితం పట్ల అభిరుచిని పెంపొందించుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుందని అన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి, కార్యక్రమ సమన్వయకర్త దీపక వెంకన్న బాబు మాట్లాడారు. ఎపిఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాస వర్మ, ఎపిఎంఎఫ్ వారి 10వ తరగతి గణిత స్టడీ మెటీరియల్‌ను డిఇఒకి, ఉపవిద్యాశాఖాధికారికి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ డి.శ్రీరామ్, జెవివి జిల్లా అధ్యక్షులు సిహెచ్ ప్రసాదరావు, హెచ్‌ఎం బి.వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్-3 కృష్ణారావు, జెవివి కోశాధికారి ఎం.శ్రీనివాస్, ఫణిరాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు, అంగన్‌వాడీలకు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని నంబర్-2 పాఠశాలలోని విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘ సభ్యులు గ్రంధి బాబి సతీమణి అరుణ జయంతి సందర్భంగా బుధవారం స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉద్దగిరి బుజ్జి, బంగారు సాయి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొడమంచిలిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సర్పంచు ఛాబాది మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి మార్కెట్ సెంటర్లో పాస్టర్ బి.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ 'సెమీ క్రిస్మస్ వేడుకల్లో' సుంకర సీతారామ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్, వైసిపి నాయకులు పోలిశెట్టి వనమారాజు, పాస్టర్ తిమోతిరాజు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ గారూ ఇచ్చిన మాట మరిచారా..

చినబాబు భార్య వేణి ఆవేదన

ఆచంట (పెనుమంట్ర): ఎంఎల్‌ఎ చెరుకువాడ తన కుటుంబాన్ని ఆదుకుంటానని ఇచ్చిన హామీని మరిచారని నెగ్గిపూడి గ్రామానికి చెందిన పులిదిండి వేణి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరుల వద్ద గోడు వెళ్లబోసుకుంది. తన భర్త చినబాబు (35) నెగ్గిపూడి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తూ గత మే 8వ తేదీన విధుల్లో ఉండగానే గుండెపోటుతో మృతి చెందారని తెలిపింది. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తన భర్త మరణించిన తరువాత పరామర్శించడానికి ఇంటికి వచ్చారని, పిల్లల చదువు బాధ్యత తనదేనని ధైర్యం చెప్పారని, జగనన్న కాలనీలో ఇల్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. అలాగే పంచాయతీలో పని ఇప్పిస్తానని, పెన్షన్ మంజూరు చేస్తానని పెద్దల సమక్షంలో హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు అంతా ఇప్పుడు ఇల్లు కట్టించే బాధ్యతను ఎంఎల్‌ఎ అప్పగించారని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ హామీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఎంఎల్‌ఎ న్యాయం చేయాలని కోరింది.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని ఆధునిక ఆవిష్కరణలు చేయాలని విద్యార్థులకు సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ సూచించారు. బుధవారం మొగల్తూరు పెద్దిగ్రాజు గంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలో పివితోట ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనకు ప్రథమ, మొగల్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనకు ద్వితీయ స్థానం లభించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బిసిలంతా జగన్ వెంటే'

ఉండి: రాష్ట్రంలో బిసిలంతా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో బిసిలకు సరైన గుర్తింపు వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసేవారని, బిసిల అభివృద్ధిని చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి బిసిలకే కాకుండా సమాజంలో వెనకబడ్డ అన్ని వర్గాలనూ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని బిసి కులాలు జగన్ రుణం తీర్చుకోవాలంటే 2024 ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రిని చేయడమే మన ముందున్న కర్తవ్యం అని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పార్లమెంట్‌లోనే భద్రత లేదు.. ప్రజలను ఎలా కాపాడతారు

సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

పార్లమెంట్‌లో ప్రజా ప్రతినిధులకు భద్రత కల్పించలేకపోతున్నారు, దేశ ప్రజలను ఎలా కాపాడతారంటూ సినీ దర్శకుడు, నటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తోలేరు నాటిక పోటీలను పురస్కరించుకుని గ్రామానికి వచ్చిన నారాయణమూర్తి మంగళవారం రాత్రి విలేకరులతో దేశంలో ప్రస్తుత పరిణామాల పట్ల మాట్లాడారు. పార్లమెంట్‌లో దాడి చేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారంటూ విపక్షాలు ప్రశ్నిస్తుంటే మోడీ, అమిత్‌షా మౌనం వహించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. దాడి చేసినవారు ఉగ్రవాదులైతే పరిస్థితి ఏంటంటూ ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారికి పాసులు ఇచ్చి బిజెపి ఎంపీపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలన్నారు. నాడు రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు ఇవ్వాలని [illegible], వెంకయ్యనాయుడులు కోరితే తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇస్తానంటూ రాముడితో మోడీ రాజకీయం చేశారన్నారు. ఆనాడు రాముడు మాట తప్పలేదని మీరు కూడా మాట తప్పొద్దని తెలిపారు. విశాఖ ఉక్కుకు కృత్రిమ నష్టాలు కలుగజేస్తూ ప్రయివేటుపరం చేస్తున్నారని, అయితే చత్తీస్‌ఘడ్‌లో ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటు పరం కానివ్వబోమని మాట ఇచ్చిన అమిత్‌షా విశాఖ ఉక్కును ఎలా ప్రయివేటుపరం చేయాలనుకుంటున్నారంటూ ప్రశ్నించారు. ఆంధ్రులు ఈ దేశ ప్రజలు కారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసే పరీక్షా పత్రాల లీకేజీ ఆటంబాబు కంటే ప్రమాదకరం అన్నారు. విద్యార్థులంటే దేశ మానవ శక్తి వనరులని, వారిని నాశనం చేసుకోకూడదని ఇదే వృత్తాంతంతో ప్రశ్నాపత్రాల లీకేజీ కుంభకోణాన్ని కథాంశంగా తీసుకుని నిరుద్యోగభారతం పేరుతో తదుపరి చిత్రాన్ని తీస్తున్నట్టు తెలిపారు.

తోలేరులో నాటిక పోటీలు ప్రారంభం

సభలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీప్రసాద్

ప్రజాశక్తి - వీరవాసరం

ఇప్పటికే నాటికలను ప్రేక్షకులు ఆదరించడం వల్లే కళాపరిషత్‌లు కొనసాగుతున్నాయని జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ నాటికల పోటీలు మంగళవారం రాత్రి జిల్లా పరిషత్ ఛైర్మన్ ప్రారంభించారు. దాయన సురేష్ చంద్రాజీ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సినీ నటులు ఆర్. నారాయణమూర్తి, రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ వంటి కళాకారుల సన్మాన కార్యక్రమంలో వేదికను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం నారాయణమూర్తిని, గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణమూర్తి, రిటైర్డ్ జడ్జి బొక్కా సత్యనారాయణ, బుద్దాల వెంకట రామారావు, రాయప్రోలు భగవాన్, గుండా రామకృష్ణ, కె.గోపాలకృష్ణ, కె.కృష్ణంరాజు, గూడూరి ఉమాబాల, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

నరసాపురం టౌన్ : విద్యార్థులు సైన్స్‌పై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని టేలర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, వార్డు కౌన్సిలర్ పతివాడ పద్మ, ఎంఇఒ పి.పుష్పరాజ్యం, విద్యా కమిటీ ఛైర్మన్లు సిహెచ్ శాంత పాల్గొన్నారు.

హరేరామ్‌కు సిపిఎం నేతల పరామర్శ

హరేరామ్‌ను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

ఆచంట: ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ సతీమణి, సిపిఎం సానుభూతి పరురాలు ఆకుల నాగకుమారి (62) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెరువు గ్రామంలో ఆమె ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందిన ఘటన విదితమే. ఆమె మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ హరేరామ్‌ను బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, కేతా.గోపాలన్, కౌరు పెద్దిరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు, సిపిఎం నాయకులు ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్‌రావు, బొర్రా ధర్మారావు పరామర్శించారు.

రామలింగేశ్వరునికి రూ.22.84 లక్షల ఆదాయం

పాలకొల్లు : క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో లెక్కించగా 83 రోజులకు రూ.22,63,834లు ఆదాయం వచ్చింది. అన్నదానానికి రూ.21,099 మొత్తం రూ.22,84,933 వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, వివిధ స్వచ్ఛంద సంస్థలు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిట్‌కు రాష్ట్ర ఉత్తమ ఇంధన పరిరక్షణ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఇంధన పరిరక్షణ 2023 అవార్డు (సిల్వర్ మెడల్) దక్కించుకుంది. ఈ విద్యాసంస్థ భవన సముదాయాలపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సమర్థవంతమైన ఎయిర్ కండిషనర్ల ద్వారా విద్యుత్‌ను ఆదా చేసి బిల్లులను తగ్గించుకోవడంతోపాటు, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషికి ఈ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎస్.చక్రధరబాబు చేతులమీదుగా నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఉద్దంటి సందీప్, డాక్టర్ తేజావతు రమేష్ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడంపై ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ ఎన్.జయరామ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకమైన ఇంధన పరిరక్షణ రంగంలో తమ విద్యాసంస్థకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం గర్వకారణంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మార్కండేయులు అధ్యక్షతన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పెన్షనర్లకు కూడా జీతాలు చెల్లించాలని, బకాయి పడ్డ పిఆర్‌సి, డిఎ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ మెంబర్ జిఎస్ఎస్ఆర్.స్వామి, నరసాపురం బాధ్యులు ఎన్‌వి.సత్యన్నారాయణ, ఎస్.అజయ్ కుమార్ పి.శాంసన్, ఎన్.విజకుమార్, యు.రాజశ్రీ, విడి రాజేశ్వరి, కళ్యాణి, పాల్గొన్నారు.

భూ హక్కు యాక్టు 27ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చీకటి చట్టం 27ను వెంటనే రద్దు చేయాలని తణుకు న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోర్టు విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ యాక్టు 27పై రాష్ట్రంలోని న్యాయవాదులతో ప్రభుత్వం చర్చించి అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ భూ యజమానులకు నష్టం కలిగించే చట్టాన్ని వెంటనే నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తణుకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణమూర్తి, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, అనుకుల రమేష్, కుసుమే యాకోజురాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదుల చేపట్టిన నిరసన కొనసాగింది. నరసాపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు బుధవారం కూడా కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం ఈ చట్టం వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ పట్టణంలో 'ప్రజా చైతన్య యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు పోలిశెట్టి రఘు రామారావు, పోలిశెట్టి నారాయణ స్వామి (బాబ్జీ), జె.సైమన్ విజయకుమార్, చల్లా దానయ్య నాయుడు, వనమాల శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ చట్టం వల్ల రాజకీయ ప్రలోభాలు పెరిగి సామాన్య ప్రజల స్థిరాస్తులకు సంబంధించిన హక్కులు దెబ్బతింటాయన్నారు. అందువల్ల ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నక్కా ఆనందబాబు, కొల్లాటి ఆదినారాయణ, కొత్తపల్లి రమేష్, చేగొండి బాలాజీ, దేవ రంజిత్ కుమార్, అందే మణి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా ఆరోగ్యశ్రీ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఆరోగ్యశ్రీ ఉపయోగాలను ప్రజలకు వివరిస్తున్న జిల్లా కలెక్టర్

రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న అతిపెద్ద కార్యక్రమం ఆరోగ్య శ్రీ అని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. చిట్టవరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన సభలో మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో కుటుంబానికి రూ. 5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ పెంచినట్లు తెలిపారు. ఇప్పుడున్న కార్డుల స్థానంలో నియోజకవర్గంలోని అర్హులందరికీ కొత్త కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. చిట్టవరంలో రూ.336 కోట్ల విలువైన 1,345 కార్డులు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, సర్పంచి తాడి లక్ష్మణరావు, ఎంపిటిసి నక్కా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: పేదల ఆరోగ్యానికి భరోసా ఆరోగ్యశ్రీ అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం పట్టణంలోని బలుసుమూడి రామాలయం వీధిలో ఆరోగ్యశ్రీ కార్డుదారులతో జిల్లా కలెక్టర్ మమేకమై ఆరోగ్యశ్రీ కార్డు ప్రయోజనాలను వారికి వివరించారు. ఇంతకుముందు ఉన్న రూ.5 లక్షల ప్రయోజనాన్ని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కార్డుదారులు గ్రహించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయో తదితర సమాచారాన్ని తెలుసుకోవడం సులువవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుదారులు డిజిటల్ కార్డులను స్వీకరించి కార్డు ప్రయోజనాలపై అవగాహన కలిగి వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల, వైద్యాధికారి ఎస్.కృష్ణదుర్గ, ఎఎన్ఎంలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్యశ్రీ కార్డులను ఎంఎల్‌ఎ లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం పట్ల లబ్ధిదారులు పూర్తిగా అవగాహన పెంచుకుని అత్యవసర సమయంలో సత్వరమే వైద్యం పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : రాష్ట్రంలో ప్రతి కుటుంబమూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రాయలం పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించడంపై బుధవారం జరిగిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా 5 లక్షల విలువైన ఉచిత వైద్యం ప్రజలకు అందుతుండగా, ఈ సౌకర్యాన్ని రూ.25 లక్షల వరకూ పెంచుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం హర్షించదగ్గ విషయమని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. బుధవారం ఎన్ఆర్‌పి అగ్రహారంలో ఆరోగ్యశ్రీ పరిధి పెంపుపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని చేయించుకోవడంలో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురవరపు వెంకటాచార్యులు, నాయకులు గలావిలి ధనుంజయ, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి షేక్ సాబ్జీ : పిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి - ఉండి



షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిఎస్ఎన్.రాజు

తోటి ఉద్యోగులను గౌరవిస్తూ వారి ఉన్నతికి పాటుపడే మహోన్నత వ్యక్తి షేక్ సాబ్జీ అని, ఆయన మృతి ఉపాధ్యాయ రంగానికి తీరని లోటు అని యుటిఎఫ్ మండల మాజీ అధ్యక్షులు పిఎస్ఎన్ రాజు అన్నారు. బుధవారం పాందువ్వ గ్రామం మండల పరిషత్ పాఠశాలలో పిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ ఎంఎల్‌సి ఉన్నప్పటికీ ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారి అభివృద్ధికి ఎప్పుడూ పాటు పడే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడం ఉపాధ్యాయ రంగాన్ని కలచివేసిందని వాపోయారు. యూనియన్లకు అతీతంగా ప్రతి ఉపాధ్యాయుడినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేవారని కొనియాడారు. అనంతరం సిపిఎం నాయకులు దండు రామలింగరాజు మాట్లాడుతూ సాబ్జీ వర్ధంతిని పాందువ్వ పాఠశాలలో ప్రతి సంవత్సరమూ నిర్వహించేందుకు వీలుగా పదివేల రూపాయల నగదు ఫిక్స్ డిపాజిట్ చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్ రాజును కొనియాడారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలు క్రీడల్లో రాణించాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయం కళాశాల ఉమెన్స్ హాస్టల్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాద్‌రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో అన్ని రకాల క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ హాస్టల్ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం, కేవలం వారిలో క్రీడా స్ఫూర్తిని కలిగించడానికి అని ఆయన పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణరాజు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు, ఎస్‌వి రంగరాజు, హాస్టల్ వార్డెన్ కిషోర్ రాజు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా రెవెన్యూ శాఖలో ఎన్నికల నిమిత్తం డేటా ఎంట్రీ ఆపరేటర్లను పొరుగు సేవల పద్ధతిలో భర్తీకి అర్హులైన ఎస్‌టి అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల నిమిత్తం మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి పొరుగు సేవల విధానంలో నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన వారై ఉండడంతో పాటు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్‌టి) వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్, బి.టెక్, బిసిఎ, ఎంసిఎలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హతలు, ఇతర సూచనలకు సంబంధించిన సమాచారం https://west-godavari.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దరఖాస్తుదారుని వయస్సు 01.07.2023 నాటికి 18 సంవత్సరాలు నిండి, 42 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు సమర్పణకు ఈనెల 24 చివరి తేదీ అని తెలిపారు. అధికారాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించినా, తప్పుడు సమాచారంతో ఏదైనా సర్టిఫికెట్లను సమర్పించిన అభ్యర్థి దరఖాస్తు తిరస్కరించనున్నట్లు తెలిపారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

దాతలు, సంఘస్తుల ఆర్థిక సాయంతో ప్రార్థనా మందిరాన్ని సుందరంగా నిర్మించడం అభినందనీయమని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. జువ్వలపాలెంలో బలరామరాజు నగర్ స్టార్ ఆఫ్ హోప్ సిబిసిఎన్‌సి నూతన దేవాలయ ప్రతిష్ఠ ఆరాధన బుధవారం నిర్వహించారు. దాతలు, సంఘస్తుల ఆర్థిక సాయంతో సుందరంగా నిర్మించిన నూతన మందిరాన్ని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజును ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రార్థన మందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్, సంఘ పెద్దలు, చర్చి కమిటీ మెంబర్లు, ఆహ్వాన కమిటీ, ట్రెజరర్ పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన నవ దంపతులు

భార్య గల్లంతు, భర్తకు గాయాలు

ప్రజాశక్తి - పెనుగొండ

గోదావరిలో నవదంపతులు దూకిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భార్య గల్లంతయ్యింది. భర్తకు గాయ్యాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం మోర్త గ్రామానికి చెందిన కైలా శివరామకృష్ణకు, పెనుగొండ మండలం వడలి జానంపేటకు చెందిన సత్యవాణికి ఈ నెల 15న వివాహం జరిగింది. అయితే వారు ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రావులపాలెం సినిమాకు వెళ్లి తిరిగి వడలి వస్తున్నారు. ఏం జరిగిందో గాని సిద్ధాంతం బ్రిడ్జిపై నుంచి ఇద్దరూ గోదారిలోకి దూకారు. స్థానికులు చూసి శివరామకృష్ణను బయటకు తీశారు. సత్యవాణి గల్లంతైంది. ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. వారి బంధువులు బుధవారం పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి కారణాలు తెలియరాలేదు.

మృతి చెందిన గొర్రెలు

రైలు ఢీకొని 80 గొర్రెలు మృతి

భీమవరం రూరల్ : భీమవరం శివారు ఉండి రోడ్డు సమీపంలో పట్టాల దాటుతున్న గొర్రెల మందను ఓ రైలు ఢీకొంది. దీంతో 80 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టాలపై చెల్లాచెదురుగా మృతి చెంది తునా తునకలైన పడిఉన్న గొర్రెలను చూసి గొర్రెల మంద కాపరి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే అదునుగా కొందరు మాంసం వ్యాపారులు మృతి చెందిన గొర్రెలను అయినకాడికి కొనుగోలు చేసి తీసుకెళ్లారు. సుమారు రూ.15,000 విలువచేసే ఒక్కో గొర్రెను వ్యాపారులు రూ.రెండు నుంచి రూ.మూడు వేలు చెల్లించి తీసుకెళ్లారు. పొట్టకూటి కోసం గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్న వారికి ఈ ప్రమాదం తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించింది. బాధిత గొర్రెల మంద కాపరులు వివరాలు చెప్పడానికి నిరాకరించారు. సంఘటన స్థలం నుంచి మిగతా గొర్రెలను తోలుకొని వెళ్లిపోయారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రైల్వే పోలీసులు తెలిపారు.